
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం : 26, మే, 2025



సోమశిలలో 44.197 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారం 44.197 టీఎంసీల నీరుంది. పెన్నార్ డెల్టాకు 3,130, ఉత్తర, దక్షిణ కాలువలకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.99,700
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,990
3 శాతం జీఎస్టీతో	రూ.9,260
నవర (8 గ్రా)	రూ.74,080

గరిష్టం/కనిష్టం
37.1 /29.3

వాతావరణం

సోమవారం జిల్లాలో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ ఆదివారం 85 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

కాకుటూరులో రాత్రివేళల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు



గ్రావెల్ తవ్వకాల ప్రదేశం

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు గ్రామంలో నిత్యం రాత్రి వేళల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. గ్రామ పరిధిలోని వడ్డిపాళెం వెనుక వైపు ఉన్న ప్రైవేటు లేఅవుట్లలోని ప్లాట్లు, ఇండస్ట్రియల్ ఏరియా, విక్రమ సింహపురి యూనివర్సిటీకి కేటాయించిన ప్రభుత్వ భూమి తదితర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో కొందరు ట్రాక్టర్ల యజమానులు గ్రావెల్ అక్రమంగా తవ్వి నెల్లూరుకు తరలిస్తున్నారు. కాకుటూరు పంచాయతీ పరిధిలో ఉన్న ఎర్రమట్టి పూలచెట్లు, కూరగాయలు సాగుకు అనుకూలంగా ఉండటంతో నెల్లూరు నగరంలో కాకుటూరు ఎర్రమట్టికి గిరాకీ ఏర్పడింది. ఒక్క ట్రాక్టర్ మట్టిని రూ.4వేల నుంచి రూ.5వేలకు విక్రయిస్తున్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాల గురించి స్థానికులు, ప్లాట్లు యజమానులు పలు దఫాలు వీఆర్వో, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రాత్రివేళల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాల కారణంగా విలువైన ప్లాట్లు గుంతలుగా మారిపోతున్నాయని వాటి యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేపల తూకాలలో మోసాలపై అధికారుల దాడులు

- మూడు కేసుల నమోదు



తూకాలను పరిశీలిస్తున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్

పొదలకూరు: తూకాల్లో తేడాలు చూపుతూ మోసాలకు పాల్పడుతున్న చేపల వ్యాపారులపై లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. కిలోకు 100 గ్రాములు తక్కువగా తూకం వేసి అమ్ముతున్న చేపల వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. చేపలు కొనుగోలు చేసే వారు తూకాల్లో మోసాలను గ్రహించి లీగల్ మెట్రాలజీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇన్‌స్పెక్టర్ రియాజ్ అహ్మద్ పట్టణంలోని గేటుసెంటరులో చేపల వ్యాపారుల ఎలక్ట్రానిక్ కాటాలపై దాడులు నిర్వహించి మూడు కేసులు నమోదు చేసి, కాటాలను సీజ్ చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ చేపల వ్యాపారులే కాక ఎలాంటి వ్యాపారుస్తులైనా తూకాలు, కొలతల్లో తేడాలకు పాల్పడితే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.


వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని ఆకలివలస సమీపంలో వెలసియున్న బుగ్గేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్వామి వారికి పంచామృతంతో అభిషేకం, హోమం, పూర్ణాహుతి, 11 గంటలకు శివపార్వతుల విగ్రహాలను కొలువు తీర్చారు. వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి మేళతాళాలు మంగళవాయిధ్యాల నడుమ శివపార్వతుల కల్యాణాన్ని అర్చకులు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల కల్యాణాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కండలేరులో 41.809 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 41.809 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1880, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

కాసుల కక్కుర్తితో గోమాతలు కబేళాలకు

ఉదయగిరి కేంద్రంగా ముఠా

- వివిధ ప్రాంతాల నుంచి గోవుల సేకరణ
- కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు తరలింపు
- అక్కడ వాటి మాంసానికి డిమాండ్
- గోవధ ముఠాకు టీడీపీ నేతల అండ

హిందువులు పరమ పవిత్రంగా పూజించే గోమాతలను కొందరు స్వార్థపరులు కబేళాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గోవధను ప్రభుత్వం నిషేధించినా ఆచరణలో ఎక్కడా అది అమలు కావడంలేదు. కాసులకు కక్కుర్తి పడిన నేతలు కబేళాలకు తరలించే పశువుల సంతలకు అనధికార అనుమతులు ఇచ్చేస్తున్నారు. వారాంతపు సంతలో వందలాది పశువులను ఇతర రాష్ట్రాల్లో వధశాలలకు పంపి వాటి పాపాన్ని మూటగట్టుకుంటున్నారు. తాజాగా కోవూరులో కబేళాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న 42 గోవులను గోసంరక్షకులు పట్టుకున్నారు. పోలీసులు మొదట తర్జనభర్జన పడినా చివరకు కేసు నమోదు చేశారు.



కబేళాకు తరలిస్తుండగా కోవూరులో పట్టుకుని విడిపించిన గోవులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఉదయగిరి కేంద్రంగా గోవధ ముఠా ఏర్పడిందని, జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన కొందరిని ఆ ముఠాలో సభ్యులుగా చేర్చుకున్నారని తెలుస్తోంది. వివిధ మండలాల్లో రైతుల నుంచి గోవులను తక్కువ ధరకు కొనుగోలు చేయడం, లేదా రోడ్లపై తిరిగే ఎవరికీ చెందని గోవులను సేకరించడం, తరువాత వాటిని కబేళాలకు తరలించడం ముఠా దినచర్యగా ఉంటోంది. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో గోమాంసానికి డిమాండ్ ఉండడంతో గోవధ ముఠా ఈ వ్యాపారాన్ని నిర్విఘ్నంగా సాగిస్తోంది.

నెల్లూరు కేంద్రంగా గోవధ

నెల్లూరులో గోవధ జరుగుతున్నట్లు ఇటీవల కొన్ని సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. నగరంలోని దీనదయాళ్‌నగర్, బోడిగాడితోట, పెన్నా నది సమీప ప్రాంతాలలో వారంలో రెండు, మూడురోజులు రాత్రి వేళల్లో గోవులను వధిస్తున్నారని తెలుస్తోంది. ఇలా వారానికి దాదాపు రూ.30 లక్షలు విలువ చేసే 25 టన్నుల గోవులు, గొడ్డు మాంసాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారు. స్థానికంగా కొంత విక్రయాలు చేయడంతో పాటు చెన్నై, కేరళ రాష్ట్రాలకు భారీగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా రూ.కోట్లలో వ్యాపారం జరుగుతోంది. పశువుల కొవ్వుతో ఆయిల్ తయారీ చేసి విక్రయాలు చేస్తున్న ముఠా కూడా నగరంలోనే ఉందని అంటున్నారు. వీరికి అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో ఈ చీకటి దందా జోలికి వెళ్లేందుకు ఎవరూ సాహసం చేయడం లేదు. అధికారులకు నెలవారీ మామూళ్లు ఇస్తుండడంతో వారు కళ్లకు గంతలు కట్టేసుకున్నారు.

ప్రజాప్రతినిధులే నీచపు వ్యాపారానికి అనుమతులు

జిల్లాలో ఒట్టిపోయిన గేదెలతోపాటు గోవులను కబేళాలకు పంపేందుకు ఏర్పాటు చేసిన పశువులు సంతకు ప్రజాప్రతినిధులే అనధికార అనుమతులు ఇవ్వడంపై ప్రజలు చీదరించుకుంటున్నారు. సహజ వనరుల దోపిడీ నుంచి పశువుల వధలో కూడా కక్కుర్తి పడడంపై ఇంత నీచమా అంటూ అసహ్యించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక నెల్లూరు నగరంతో పాటు కోవూరు నియోజకవర్గంలో పశువుల సంత నిర్వహించేవారు. అక్కడి ప్రజాప్రతినిధులపై తీవ్ర స్థాయిలో విమర్శలు రావడంతో వాటిని తొలగించారు. ఆపై అదే ముఠా సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలంలో పశువుల సంత బహిరంగంగానే నిర్వహిస్తోంది. నెలవారీగా రూ.లక్షల్లో మామూళ్లు తీసుకుంటూ పశువుల సంతకు అధికారులు సహకరిస్తున్నారు. 1980 జంతు సంరక్షణ చట్టం ప్రకారం పశువులను వధించడం నేరం. కానీ కూటమి పాలనలో చట్టాలను చుట్టాలుగా మార్చుకుని నీచానికి దిగజారుతున్నారు.

42 గోవులు పట్టివేత

మూడు రోజుల క్రితం కోవూరులో కబేళాలకు పంపేందుకు సిద్ధంగా ఉన్న 42 గోవులను గోసంరక్షణ, ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందినవారు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన వారిలో ఉదయగిరికి చెందిన ముఠాతోపాటు సర్వేపల్లి నియోజకవర్గంలోని మత్తుకూరు, టీపీగూడూరు మండలాలకు చెందిన కొందరు హిందువేతరులు ఉన్నారు. వారికి రాజకీయ అండదండలు ఉండడంతో కేసు నమోదు చేసేందుకు పోలీసులు తొలుత తర్జనభర్జన పడినా చివరికి కేసు నమోదు చేశారు. పోలీసులు దీనిపై సమగ్రంగా దర్యాప్తు చేసి ముఠా నాయకులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు

జిల్లాలో గోవధ జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు మామూళ్లకు అలవాటుపడి చోద్యం చూస్తున్నారు. పశుసంవర్ధక, పోలీస్, మార్కెటింగ్ శాఖలకు పశువులు, గోవులు తీసుకెళ్లే వాహనాల నుంచి మామూళ్లు అందుతున్నాయన్న ఆరోపణలున్నాయి. జాతీయ రహదారిపై పశువుల వాహనం కన్పిస్తే చాలు ఖాకీలు ఎదురేగి వసూళ్లు చేస్తున్న సంఘటనలు ఎన్నో వెలుగుచూశాయి.

పెన్నానదిలో అమ్మవారి విగ్రహం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ వద్ద పెన్నానదిలో ఆదివారం అమ్మవారి విగ్రహం బయటపడింది. స్థానికుల కథనం మేరకు.. పెన్నానదిలో నీరు తగ్గడంతో అమ్మవారి విగ్రహం ఇసుకలో కనిపించింది. కామాక్షితాయి బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులు విగ్రహం వద్ద సెల్ఫీలు దిగి సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో విషయం వైరల్‌గా మారింది. విగ్రహం ఎప్పటి నుంచో అక్కడే ఉందని, కొందరు భక్తులు ఆదివారం విగ్రహాన్ని నిలబెట్టడంతో పలువురు ఫొటోలు దిగారని మరికొంతమంది స్థానికులు తెలిపారు.



అమ్మవారి రాతి విగ్రహం



మాట్లాడుతున్న మాజీ మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్, చిత్రంలో ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి, మేరిగ, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, మల్లి నిర్మల తదితరులు

కాకాణి అరెస్ట్ కక్షసాధింపు చర్యే

- అక్రమ అరెస్ట్‌లకు భయపడేది లేదు
- రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తాం
- మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎప్పుడూ చూడని విధంగా కూటమి ప్రభుత్వ హయాంలో అరెస్ట్‌లు జరుగుతున్నాయని, మాజీ మంత్రుల వద్ద నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల వరకు కక్షసాధింపు చర్యలతో అరెస్ట్‌లు చేస్తున్నారని మాజీమంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారన్న విషయం తెలుసుకున్న వెంటనే జిల్లాలోని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు హుటాహుటిన జిల్లా పార్టీ కార్యాలయానికి ఆదివారం రాత్రి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతి అక్రమాలను నిలదీస్తున్న కాకాణిని కట్టడి చేసేందుకు కూటమి ప్రభుత్వం పథకం ప్రకారం అక్రమ కేసులు బనాయించిందన్నారు. అసలు మైన్స్ వద్దకే వెళ్లని కాకాణిపై రెండు నెలల కిందట పలురకాల కేసులు పెట్టి, చివరకు అట్రాసిటీ కేసు సైతం బనాయించారన్నారు. ఇలా కుట్రపూరితంగా కాకాణిని వేధించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. అరెస్ట్‌పై ఇంతవరకూ పోలీసులే క్లారిటీ ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారాన్ని అడ్డంపెట్టుకుని అన్యాయంగా వేధిస్తోందని, ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ నాయకులు గొంతులు ఎత్తుతుంటే వాటిని నొక్కే ప్రయత్నం చేస్తున్నారని, అందులో భాగంగానే అక్రమ కేసులు, అరెస్ట్‌లని ధ్వజమెత్తారు. కేసులకు భయపడేదే లేదని, తామంతా కలిసికట్టుగా కాకాణికి అండగా ఉంటామని, న్యాయస్థానాల్లో న్యాయం కోసం పోరాడుతామని చెప్పారు. ప్రజలను దగాచేస్తున్న కూటమి ప్రభుత్వానికి వారే తగిన రీతిలో బుద్ధిచెబుతారన్నారు. ఎమ్మెల్సీ, నగర వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇది అత్యంత బాధాకరమైన రోజన్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డికి మైన్స్‌తో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ సంబంధం లేదని, అలాంటి వ్యక్తిని అక్రమ కేసుల్లో ఇరికించడం బాధాకరమన్నారు. హైకోర్టుకు వెళుతున్నామని బెయిల్ వచ్చినా రాకున్నా పోలీసుల విచారణకు హాజరవుతామని చెప్పారన్నారు. బెయిల్ రాకుండా అధికార పార్టీ అడ్డుకుందన్నారు. ఎవ్వరో ఇచ్చిన అబద్ధపు వాంగ్మూలం ఆధారంగా కాకాణిని అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. ఇలాంటి చర్యలు జిల్లాలో ఇదే ప్రప్రథమమన్నారు. ఈ క్రమంలోనే కాకాణిని అరెస్ట్ చేశారని, అయితే ఎక్కడకు తీసుకెళుతున్నారు? ఎక్కడ ఉంచారు? అన్న కనీస సమాచారం ఇవ్వకుండా ఉంచడం చట్టవిరుద్ధమన్నారు. మంత్రిగా పనిచేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినప్పుడు కనీస సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత పోలీసులకు లేకపోవడం బాధ్యతా రాహిత్యమేనన్నారు. జిల్లా పార్టీ అంతా కాకాణికి అండగా ఉందన్నారు. న్యాయశాఖమీద తమకు గౌరవం ఉందనీ, అక్రమ కేసులపై న్యాయపోరాటం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం మహానాడు పేరిట సంబరాలు జరుపుకుంటున్నారని, అయితే ఏడాదికాలంలో జరిగిన అరాచకపాలన ప్రజలందరు గమనిస్తున్నారన్నారు. ప్రజలను భయపెట్టేందుకే నాయకులను అరెస్ట్ చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ దుర్మార్గాలు, అక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళతామన్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసాన్ని ఎవ్వరూ పోగొట్టలేరన్నారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నించే ప్రతిపక్ష నాయకుల గొంతులు నొక్కడం ప్రజాస్వామ్యం కాదన్నారు. ఇలాంటి సమయాల్లో ప్రతి కార్యకర్త మనోనిబ్బరాన్ని కల్గి ఉండాలన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేరున్న వ్యక్తిని అరెస్ట్ చేసినప్పుడు కనీస ప్రోటోకాల్‌ను పాటించకపోవడం దారుణమన్నారు. సంబంధం లేని కేసుల్లో ఇరికించి, వేధించి అరెస్ట్‌లు చేయడం కూటమి ప్రభుత్వానికి అలావాటైపోయిందన్నారు. అక్రమ కేసులకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ కాకాణి అరెస్ట్ అప్రజాస్వామికమన్నారు. దొంగ కేసులు బనాయించడమే కాకుండా చివరికి అబద్ధపు అట్రాసిటీ కేసు సైతం నమోదు చేయడం విడ్డూరమన్నారు. కాకాణి అరెస్ట్‌ను ముక్తకంఠంతో నాయకులు ఖండించారు. జిల్లాలోని ప్రతి కార్యకర్త, నాయకులు కూటమి ప్రభుత్వ అరాచకాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నేతలు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓలపై సర్కారు చిన్నచూపు

- గత నెల జీతాలు ఇవ్వలేదు
- ఇన్‌సెంటివ్స్‌లకు కోతే
- మెటీరియల్ రవాణా చార్జీలు లేవు
- పీఎఫ్, భవనాల అద్దెకు అదే పరిస్థితి
- 29 రోజులుగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మూత
- ఇబ్బందుల్లో గ్రామీణ రోగులు

నెల్లూరు(అర్బన్): ఆయుష్మాన్ భారత్ కింద నిర్మించిన విలేజ్‌హెల్త్ క్లినిక్‌లలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ)లపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పూనుకుంది. తమ సమస్యలు పరిష్కరించాలని కోరినందుకు గత నెల జీతాన్ని కూడా కూటమి ప్రభుత్వం ఆపేసింది. దీంతో తమ డిమాండ్లు తీర్చాలని కోరుతూ సీహెచ్‌ఓలు గత 29 రోజులుగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లను మూసేసి సమ్మె బాట పట్టారు. మొక్కవోని దీక్షతో జిల్లా వైద్యశాఖ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు చేస్తున్నారు. మరోవైపు విలేజ్ హెల్త్ క్లినిక్‌లను మూసేయడంతో వృద్ధులు, నడవలేనివారు, గర్భిణులు వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

విధులు బారెడు..

జిల్లాలో ఆయుష్మాన్ భారత్ కింద కేంద్ర నిధులతో 500 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించారు. గ్రామాల్లో డాక్టర్ అందుబాటులో లేని చోట సీహెచ్‌ఓలను నియమించారు. వీరిలో 95 శాతానికి పైగా మహిళలే. వీరంతా 5 ఏళ్లపాటు బీఎస్సీ నర్సింగ్, ఆపైన ఎమ్మెస్సీ నర్సింగ్ చేసి శిక్షణ పొందారు. వీరు విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ఉదయం 9 గంటలకు వచ్చి ముఖ హాజరు వేసుకోవాలి. ఆపైన ఓపీ చూడాలి. మధ్యలో గ్రామంతో పాటు అనుబంధంగా ఉండే మజరా(హామ్‌లెట్)కు వెళ్లాలి. ఆయా ప్రాంతాల్లో నడవలేని వృద్ధులను ఇంటివద్దనే పరీక్షించాలి. అక్కడే మందులు ఇవ్వాలి. సమస్య ఎక్కువగా ఉంటే పీహెచ్‌సీ లేదా పెద్దాస్పత్రికి రెఫర్ చేయాలి. మధ్యాహ్నం మళ్లీ వచ్చి ముఖహాజరు (ఎఫ్ఆర్ఎస్) వేయాలి. సాయంకాలం ఇంటికి వెళ్లేటప్పుడు ఎఫ్ఆర్ఎస్ వేయాలి. గ్రామీణ ప్రాంతం కాబట్టి నెట్ సరిగా లేక ఒక్కో దఫా సిగ్నల్స్ రాక ఎఫ్ఆర్ఎస్ వేయాలంటే ఇబ్బంది. ఆస్పత్రిలో 14 రకాల పరీక్షలు చేయాలి. గర్భిణులను ఇంటివద్దనే పరిశీలించాలి. రోగులకు ఆరోగ్యంపై కౌన్సెలింగ్ ఇవ్వాలి. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అవసరం అనుకుంటే ఆయా రోగులకు స్పెషలిస్టు వైద్యుల ద్వారా వీడియో కాల్ చేయించి రోగులకు టెలీ మెడిసిన్ అందించాలి. కేన్సర్, టీబీ, కుష్టు లాంటి కేసులకు సంబంధించి స్క్రీనింగ్ పరీక్షలు చేయించాలి. వీరు చేసే పనులన్నింటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఇంత చేసినా వారిని అధికారులు లెక్కలోకి తీసుకోవడం లేదు. ఎందుకంటే వారు కాంట్రాక్టు పద్ధతిలో చేరిన ఉద్యోగులని నిర్లక్ష్యం.



డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీహెచ్‌ఓలు

జీతం బెత్తెడు

జిల్లాలో 500 విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు గాను 495 మంది పని చేస్తున్నారు. వీరికి జీతం కేవలం రూ.25 వేలు మాత్రమే. మరో రూ.15 వేలు ఇన్‌సెంటివ్స్ రూపంలో ఇవ్వాలి. అయితే సీహెచ్‌ఓలుగా చేరిన వారిలో ఏ ఒక్కరూ కూడా ఏ నెల కూడా రూ.15 వేలు ఇన్‌సెంటివ్స్ తీసుకోలేదు. రూ.5 నుంచి 6వేలు, రూ.7వేలు మాత్రమే అందుకున్నారు. వీరు జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో జరిగే శిక్షణలకు మిగతా ఉద్యోగులకు భిన్నంగా సొంత ఖర్చులు పెట్టుకుని హాజరు కావాలి. మందులు, ఆస్పత్రికి సంబంధించిన పరికరాలు లాంటివి వారే నేరుగా వైద్యశాఖ కార్యాలయానికి వచ్చి రవాణా ఛార్జీలు భరించి తీసుకెళ్లాలి. ఇది చాలదన్నట్టు పలువిలేజ్ హెల్త్ క్లినిక్‌లు అద్దె భవనాల్లో ఉన్నాయి. ప్రభుత్వం అద్దె కింద రూ.3వేలు ఇవ్వాల్సి ఉంది. అయితే ముత్తుకూరు లాంటి పలు చోట్ల రూ.3వేలకు అద్దె భవనాలు దొరకడం లేదు. దీంతో మరో రూ.2వేలు తమ జేబులో నుంచి తీసి అద్దె చెల్లిస్తున్నారు. చెల్లించే అరకొర అద్దె కూడా సకాలంలో విడుదల చేయడం లేదు.

జాబ్ చార్ట్ అంటూ లేదు

వీరికి నిర్దిష్ట జాబ్ చార్టు అంటూ లేదు. సెలవులు లేవు. అధికారులు ఏపని చెప్పినా చేయాల్సిందే. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రూము ఊడ్చడం నుంచి పాయిఖానాలు శుభ్రపరచుకోవడం వరకు సీహెచ్‌ఓదే బాధ్యత. దీంతో సీహెచ్‌ఓలు తమ విధులకు సంబంధించి నిర్దిష్ట జాబ్ చార్ట్ కావాలని కోరుతున్నారు. కనీసం పీఎఫ్ లేదు.


గత నెల జీతం ఇవ్వలేదు

సీహెచ్‌ఓలు గత నెలలో పూర్తిగా విధులకు హాజరయ్యారు. ఈనెలలో సమ్మెకు పూనుకున్నారు. అయినా గత నెల జీతం కూడా ఇవ్వకుండా వారిని ప్రభుత్వం వేధిస్తోంది. కనీసం వారి డిమాండ్స్‌ను అంగీకరించే పరిస్థితి లేకుండా పోయింది. పైగా వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నెల్లూరు పర్యటనకు వచ్చినప్పుడు సీహెచ్‌ఓలపై నోరు పారేసుకున్నారు. హీనంగా మాట్లాడాడు. వేలు చూపిస్తూ నావద్దకు మిమ్మల్ని ఎవరు రానిచ్చారంటూ ఫైరయ్యారు. మిమ్మల్ని తీసేస్తే మాకు రూ.500 కోట్లు మిగులుతుందంటూ బెదిరించారు. మీ స్థానంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్ల చేత పనిచేయించుకుంటామంటూ విరుచుకుపడ్డారు.

ప్రధాన డిమాండ్లు ఇవే

- నేషనల్ హెల్త్ మిషన్ కింద సీహెచ్‌ఓలతో పాటు 197 క్యాడర్లున్నాయి. 196 కేడర్లకు పీఆర్‌సీ ఇచ్చి న్యాయం చేశారు. కేవలం సీహెచ్‌ఓలకు మాత్రమే గత 6 ఏళ్లుగా ఒక్క రూపాయి జీతం పెంచడంగాని, ఒక్క ఇంక్రిమెంట్ ఇవ్వడం గాని జరగలేదు. దీంతో వారు తమకు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతనాలు పెంచాలని కోరుతున్నారు.
- నిర్దిష్ట జాబ్ చార్టు ప్రకటించాలని కోరుతున్నారు.
- పీఎఫ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.
- పెండింగ్ బకాయిలను చెల్లించాలని, రవాణా చార్జీలను విడుదల చేయాలంటున్నారు.
- అద్దె భవనాలకు సంబంధించిన పూర్తి అద్దెను ఇవ్వాలని కోరుతున్నారు.
- ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో పని చేసే వారికి ప్రత్యేక ఇన్‌సెంటివ్స్ ఇవ్వాలంటూ సమ్మె బాట పట్టారు.


సమ్మె ఆగదు



తాము న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాం. గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. ఓపీ సేవలతో పాటు వృద్ధులను పరీక్షించేందుకు రోగుల ఇళ్ల వద్దకు వెళ్తున్నాం. అక్కడే బీపీ చెక్ చేసి సెలైన్లు పెడుతున్నాం. ఇంత చేసినా తమకు ఇచ్చే జీతాలు తక్కువ. అందుకే జీతాలు పెంచాలని సమ్మె చేస్తున్నాం.

– రుబేకా, సీహెచ్‌ఓల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

నిందలు ఆపాలి




తాము రోగులకు మంచి వైద్యం అందేలా చాకిరి చేస్తున్నాం. అయినా కొంతమంది అధికారులు తమపై పని చేయనట్టు నిందలు వేస్తున్నారు. ఇది తగదు. వైద్యంతో పాటు తాము ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. గ్రామంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ చేయాల్సిన వాటర్ క్వాలిటీ టెస్టును మెడికల్ ఆఫీసర్ ద్వారా తామే చేస్తున్నాం. తేడాలుంటే పంచాయతీ కార్యదర్శికి చెప్పి నీటిలో లోపాలు లేకుండా చేస్తున్నాం. బ్లీచింగ్ తదితరాలు సక్రమంగా వినియోగించేలా సహకరిస్తున్నాం. అందువల్ల ప్రభుత్వం మా సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలి.

– గాయత్రి, జొన్నవాడ పీహెచ్‌సీ, సీహెచ్‌ఓ

టీకాతో ధోకా

చిన్నారుల్లో తట్టు, పొంగు, రూబెల్లా వ్యాధుల నివారణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఎమ్మార్ వ్యాక్సిన్‌పై స్పెషల్ డ్రైవ్‌ను జిల్లాలో సోమవారం ప్రారంభించనున్నారు. ఇప్పటి వరకు వేయించుకోని చిన్నారులను గుర్తించి, వీటిని అందజేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. మొత్తం మూడు రౌండ్లలో నూరు శాతం లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులేస్తోంది.



ఎమ్మార్ వ్యాక్సిన్‌పై నేటి నుంచి స్పెషల్ డ్రైవ్

- వేయించుకోని ఐదేళ్లలోపు వారి కోసం
- మూడు రౌండ్లలో నూరు శాతం లక్ష్య సాధనకు కృషి
- తట్టు, పొంగు, రూబెల్లా వ్యాధులకు చెక్

నెల్లూరు(అర్బన్): అంటువ్యాధుల నివారణకు ముందస్తుగా వేసుకునే సూది మందు టీకా. ప్రమాదభరితంగా ఉండే మీజిల్స్, రూబెల్లా నివారణకు సైతం ఇదే కీలకం. ఈ క్రమంలో వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. వ్యాధుల నివారణే ధ్యేయంగా ముందుకెళ్తూ.. ఇప్పటివరకు టీకాను వేయించుకోని ఐదేళ్లలోపు పిల్లలకు అందించేలా స్పెషల్ డ్రైవ్‌కు సోమవారం శ్రీకారం చుట్టనున్నారు.

టీకాలు వేయించుకోకుండా ఉన్న చిన్నారులను గుర్తించేందుకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ప్రణాళికను పూర్తి చేసింది.

తొలి దశ సర్వే పూర్తి

జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 1.72 లక్షల మంది ఉన్నారు. ప్రధానంగా 226 హైరిస్క్ గల గిరిజన ప్రాంతాలు, ఇటుక బట్టీల్లో పనిచేసే వారు, రొయ్యలు, చేపల గుంటల వద్ద పనిచేసే కుటుంబాలు, భవన నిర్మాణ కార్మికులకు చెందిన ఐదేళ్లలోపు చిన్నారులను వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఎంపిక చేసిన చోట్ల తొలి దశ సర్వేను ఈ నెల 16 నుంచి 23 వరకు జరిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 96 మంది, నెల్లూరు అర్బన్‌లో 64 మంది ఇప్పటి వరకు ఎమ్మార్ టీకాను వేయించుకోలేదనే అంశాన్ని గుర్తించారు.

మూడు విడతల్లో ప్రక్రియ

జిల్లాకు వలస వచ్చే కార్మికులతో పాటు సంచార జీవితాన్ని గడిపే వారి పిల్లలకు మూడు రౌండ్లలో సర్వే చేస్తూ ఈ టీకాను వేయనున్నారు. ఈ నెల 26 నుంచి 31 వరకు.. జూన్ 23 నుంచి 28 వరకు.. జూలై 21 నుంచి 26 వరకు టీకాను అందజేయనున్నారు.

తొమ్మిది నెలలున్నా తప్పనిసరి

తొమ్మిది నెలలొస్తే ఎమ్మార్ టీకాను తప్పక తీసుకోవాలి. అలా కాకుండా ఉంటే తొమ్మిది నెలల నుంచి ఐదేళ్లలోపు వారికి ఎమ్మార్ – 1 ద్వారా, 16 నెలల నుంచి ఐదేళ్లలోపు వారికి ఎమ్మార్ – 2 కింద వేయనున్నారు. మిగిలిన అన్ని రకాల టీకాలను వేశారో లేదా పరిశీలించనున్నారు. అలా కాకపోతే షెడ్యూల్ ప్రకారం వేయనున్నారు.

యాప్‌లో వివరాల నమోదు

బిడ్డకు సంబంధించిన ఆధార్‌కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబర్‌ను తీసుకొస్తే వివరాలను యూవిన్ యాప్‌లో ఏఎన్‌ఎంలు నమోదు చేయనున్నారు. వెంటనే యూవిన్ కార్డు నంబర్‌తో పాటు టీకా వేయించుకున్న ఆన్‌లైన్ సర్టిఫికెట్ రానుంది. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం దేశంలోని ఏ ప్రాంతానికి వెళ్లినా, ఈ నంబర్‌ను ఎంటర్ చేయడం ద్వారా బిడ్డకు వేసిన టీకాల వివరాలలు తెలుస్తాయి.

మీజిల్స్ లక్షణాలు

చుక్కలు, చుక్కలుగా.. ఎర్రగా ముఖం కందిపోవడం, స్వల్ప జ్వరం, జలుబు, శ్వాస సంబంధిత ఇన్‌ఫెక్షన్లు మీజిల్స్ ద్వారా రావచ్చు. చివరికి నిమోనియోగా మారి పిల్లల్లో ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో టీకాలను తప్పక వేయించుకోవాలి. ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తల సహకారంతో వీటిని ఏఎన్‌ఎంలు వేయనున్నారు.

తల్లిదండ్రులు చొరవ చూపాలి



జిల్లాలో ఎమ్మార్ టీకాను నూరు శాతం మేర వేసేలా కృషి చేస్తున్నాం. వైద్యశాఖ సర్వేలో ఈ టీకాను వేయించుకోని వారికి ఇతర టీకాలనూ షెడ్యూల్ మేరకు వేయిస్తాం. పిల్లలకు టీకాలను వేయించేలా తల్లిదండ్రులు చొరవ చూపాలి.

– ఉమామహేశ్వరి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

క్లుప్తంగా

హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. నగరంలోని ఏసీ స్టేడియంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా హరిచంద్రారెడ్డి, కార్యదర్శిగా అజయ్‌కుమార్, కోశాధికారిగా జితేంద్ర ఎన్నికయ్యారు. సమావేశానికి చైర్మన్‌గా రవీంద్రబాబు, రిటర్నింగ్ అధికారిగా న్యాయవాది రంగరాజన్ వ్యవహరించారు. వెంకటేశ్వరరావు, డీఎస్డీఓ యతిరాజ్, జిల్లా ఒలింపిక్ సంఘ ప్రతినిధి అరిగెల విజయకుమార్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు గాదం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల మహాసభల జయప్రదానికి పిలుపు



మాట్లాడుతున్న బందగీ సాహెబ్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లిలో జూన్ ఆరున నిర్వహించనున్న వీఆర్‌ఏల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని వీఆర్‌ఏల సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బందగీ సాహెబ్ పిలుపునిచ్చారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన వీఆర్‌ఏల జిల్లా కమిటీ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నామని వెల్లడించారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భాస్కర్, పెంచలనరసయ్య, లచ్చయ్య, సుబ్బయ్య, ఓబులేసు, షమీమ్, సీతమ్మ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

రీవాల్యుయేషన్లో పెరిగిన మార్కులు



విద్యార్థినికి అభినందన

ఆత్మకూరు: పదో తరగతిలో ఆశించిన మార్కులు రాకపోవడంతో నిరాశకు గురైన విద్యార్థి రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక మార్కులు పెరగడంతో విద్యార్థి ఆనందానికి అవధుల్లేకుండాపోయింది. వివరాలు.. పట్టణంలోని చైతన్య పాఠశాల విద్యార్థిని మేఘనకు ఫలితాల్లో 590 మార్కులే వచ్చాయి. ఈ క్రమంలో రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోగా, ఇది 598కు పెరిగింది. ఆత్మకూరు చరిత్రలో ఈ స్థాయిలో మార్కులు సాధించిన తొలి విద్యార్థిగా నిలిచింది. దీంతో పాఠశాలలో ఆమెను ఆదివారం అభినందించారు. పాఠశాల జీఎం కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు



పెద్దవి:	రూ.50
సన్నవి:	రూ.25
పండ్లు:	రూ.15

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.127
లేయర్	రూ.110
బ్రాయిలర్ చికెన్:	రూ.230
స్కిన్‌లెస్ చికెన్:	రూ.254
లేయర్ చికెన్:	రూ.187

ఉలవపాడులో సందడి



ట్రేల్లో కాయల విక్రయాలు

- మామిడికాయల లోకల్ మార్కెట్ ప్రారంభం

ఉలవపాడు: ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఉలవపాడు మామిడి కాయల లోకల్ మార్కెట్ ప్రారంభమైంది. స్థానిక ఉత్తర బైపాస్ జంక్షన్ దిగి లోపలికి వచ్చే ప్రాంతం నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు మార్కెట్‌ను ఏటా ఏర్పాటు చేస్తారు. మామిడి కాయలను వివిధ ప్రాంతాల రైతులు తీసుకొచ్చి విక్రయిస్తారు. పండుకాయలు, పచ్చి కాయలు రెండింటి విక్రయాలను సాగిస్తున్నారు. ఇక్కడ మార్కెట్ ప్రారంభమైందంటే ఉలవపాడు మామిడికాయలు పూర్తిగా పక్వానికి వచ్చి విక్రయానికి సిద్ధమైనట్లే. అయితే ప్రస్తుతం పూర్తి స్థాయిలో కాయలు రాలేదు. రెండు రోజుల క్రితం నలుగురు రైతులతో ప్రారంభమైన ఈ మార్కెట్.. ప్రస్తుతం 50 మంది రైతులు, వ్యాపారులతో కళకళలాడుతోంది. ఉలవపాడున, బంగినపల్లి, చిన్న రసాలు, పెద్దరసాల కాయలను ఇక్కడ విక్రయిస్తున్నారు. ఈ ఏడాది ఉలవపాడు మామిడి ఆలస్యం కావడంతో లోకల్ మార్కెట్ మే చివర్లో ప్రారంభమైంది.

పండుకాయల అమ్మకాలు

స్థానిక మార్కెట్లో పండుకాయల అమ్మకాలు జరుగుతున్నాయి. ట్రేలో సుమారు 30 నుంచి 40 కాయలుంటాయి. వీటిని సుమారు రూ.1500 నుంచి రూ.రెండు వేల వరకు విక్రయిస్తున్నారు. అధిక సంఖ్యలో మామిడి కాయలు వారంలో వచ్చే అవకాశం ఉందని రైతులు తెలిపారు.



ఉత్తర బైపాస్ దిగే చోట ఏర్పాటైన లోకల్ మార్కెట్

ట్రావెల్స్ బస్సును ఢీకొట్టిన లారీ

- ఒకరి మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు
- మృతుడి కుమారుడి పరిస్థితి విషమం
- బాధితులంతా విజయవాడ వాసులే
- హైవేపై గండవరం సబ్‌స్టేషన్ వద్ద ఘటన



మృతి చెందిన బాబూరావు



లారీ ఢీకొట్టడంతో పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

కొడవలూరు: మండలంలోని గండవరం సబ్‌స్టేషన్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం వేకువ జామున ఆగి ఉన్న ట్రావెల్స్ బస్సును వెనుక నుంచి వచ్చిన కంటైనర్ లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులంతా విజయవాడకు చెందిన వారే. పోలీసులు తెలిపిన వివరాల మేరకు విజయవాడ నగరం నుంచి నాగూర్ నాగపట్నం వెళ్లేందుకు 40 మంది ప్రయాణికులు ట్రావెల్స్ బస్సులో శనివారం రాత్రి బయలుదేరారు. కొడవలూరు మండలం గండవరం సబ్‌స్టేషన్ వద్దకు ఆదివారం వేకువ జామున 4 గంటల ప్రాంతంలో చేరుకున్నారు. ఇక్కడ ఖాళీ ప్రదేశం ఉండడంతో ప్రయాణికులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు బస్సును రోడ్డుకు పక్కగా నిలిపారు. ప్రయాణికుల్లో కొందరు ఖాళీ ప్రదేశాల్లో ఉండగా, విజయవాడ క్రీస్తురాజుపురానికి చెందిన సిరింగి బాబూరావు(50) బస్సు వెనుక నిల్చున్నారు. ఇంతలో చీమకుర్తి నుంచి చెన్నై పోర్టుకు వెళుతున్న కంటైనర్ లారీ ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. లారీ అతివేగంతో ఢీకొట్టడంతో బస్సు పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సు వెనుక నిల్చొని ఉన్న బాబూరావు రెండు వాహనాల మధ్య నలిగి అక్కడికక్కడే మృతిచెందగా, బస్సులో ఉన్న ప్రయాణికుల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ వారిని 108లో చికిత్స నిమిత్తం నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన వారిలో మృతుని కుమారుడైన కిరణ్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉందని ఎస్సై కోటిరెడ్డి తెలిపారు.

ప్రమాదం జరిగిన కొద్ది సేపటికే రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, కొడవలూరు సీఐ సురేంద్రబాబులు ఘటనా స్థలానికి చేరుకొన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు సహాయక చర్యలు చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మిన్నంటిన రోదనలు

నాగూర్ నాగపట్నం వెళ్లి దర్శనం చేసుకొని వచ్చేందుకని బయలు దేరిన వారిని మార్గమధ్యలో జరిగిన ప్రమాదం కలచి వేసింది. యాత్రకు చేరుకోక ముందే బాబూరావు మృతి చెందడం, కుమారుడి పరిస్థితి విషమంగా ఉండడంతో మృతుని భార్య మున్నీ కన్నీటి పర్యంతమయ్యారు. మున్నీ రోదన బస్సులోని తోటి ప్రయాణికులను కలచి వేసింది.



విలపిస్తున్న బాబూరావు భార్య మున్నీ

క్షతగాత్రుడికి ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తీవ్ర గాయాలతో మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కిరణ్‌కుమార్‌ను వైఎస్సార్‌సీపీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని వైద్యులతో మాట్లాడారు. క్షతగాత్రునికి ధైర్యం చెప్పి పార్టీ అండగా ఉంటుందని ఓదార్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు అశ్రిత్ రెడ్డి, నాయకులు అశోక్, లోకేష్, వెంకట్, ఖాదర్, చంద్ర, ప్రసన్న, మీరా పెంచలయ్య, ప్రసాద్‌లు ఎమ్మెల్సీ వెంట ఉన్నారు.

కారు ఢీకొని యువకుడి దుర్మరణం



నెల్లూరు సిటీ: కారు ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన నారాయణరెడ్డిపేట వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తోటపల్లిగూడూరు మండలం ఈదూరుకు చెందిన మోచర్ల శరత్ (35) జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఇందుకూరుపేట నుంచి నెల్లూరు వైపు వస్తుండగా, నారాయణరెడ్డిపేట వద్ద గుర్తుతెలియని కారు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలను సేకరించారు. బైక్‌ను ఢీకొన్న కారు వివరాల కోసం మార్గంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రూరల్ సీఐ వేణు దర్యాప్తు చేస్తున్నారు.

హంసవాహనంపై ఆంజనేయుడు



నెల్లూరు(బృందావనం): హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారు హంసవాహనంపై ఆదివారం కొలువై భక్తులను అనుగ్రహించారు. ఉభయకర్తగా విరుపావఝుల గిరికృష్ణ వ్యవహరించారు. ఈఓ రఘురామయ్య పర్యవేక్షించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తి తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కిసాన్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ల్యాబ్ టెక్నీషియన్ లాబాన్ (34) కిసాన్‌నగర్‌లోని మూడోవీధిలో కుమార్తె పేరిట ల్యాబ్‌ను నిర్వహిస్తూ కుటుంబంతో కలిసి అక్కడే ఉంటున్నారు. ఎప్పటిలాగే భార్య సంగీత, పిల్లలు లాస్య, రిత్విక్‌ను ఎన్టీఆర్‌నగర్‌లోని తన తల్లిదండ్రుల ఇంట్లో శనివారం వదిలిపెట్టి ఇంటికొచ్చారు. రాత్రి 10.30కు భార్యతో వీడియోకాల్ మాట్లాడారు. చర్చికి వెళ్లేందుకు లాబాన్ ఆదివారం ఉదయం రాకపోవడంతో భార్య ఫోన్ చేశారు. పలుమార్లు యత్నించినా ప్రయోజనం లేకపోవడంతో పక్కింటివారికి ఫోన్ చేసి విషయాన్ని సంగీత తెలియజేశారు. వారు వెళ్లగా, ముందు తలుపు మూసి.. వెనుక తలుపు తెరిచి ఉంది. లోపలికెళ్లిచూడగా బెడ్‌పై లాబాన్ ఉలుకూ పలుకూ లేకుండా పడి ఉన్నారు. మొహానికి ప్లాస్టిక్ కవర్‌ను చుట్టి షూ లేస్‌తో కట్టి ఉండటాన్ని గమనించి.. సంగీతకు విషయాన్ని తెలియజేశారు. హుటాహుటిన చేరుకున్న ఆమె తన భర్త మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నవాబుపేట ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. వేలిముద్రలను క్లూస్‌టీమ్ సేకరించింది. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

విభిన్న కోణాల్లో దర్యాప్తు

లాబాన్ మృతి పలు అనుమానాలకు తావిస్తోంది. మృతి చెందిన తీరును బట్టి ఎవరైనా ఓ పథకం ప్రకారమే ఊపిరాడకుండా చేసి హతమార్చారాననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో విభిన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆయనకు ఎవరితోనైనా విభేదాలు.. పాతకక్షలున్నాయా అనే కోణాల్లో సైతం విచారణ జరుపుతున్నారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



108లో క్షతగాత్రుల తరలింపు

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలోని కుల్లూరు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. కుల్లూరు నుంచి కమ్మవారిపల్లికి వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని రాపూరు వైపు నుంచి ఉప్పలపాడు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను 108లో నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను అనంతసాగరం మండలంలోని కమ్మవారిపల్లికి చెందిన మల్లికార్జున, పోలిరెడ్డి ప్రభాకర్, మద్దెల మయాంక్‌రెడ్డి, కొమ్మి సుధాకర్‌గా గుర్తించారు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

ఆటో, బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు



వరికుంటపాడు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని విరువూరు కోటవర్ధనపల్లి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పామూరు నుంచి కృష్ణంరాజుపల్లికి బైక్‌పై రుద్రరాజు శ్రీనివాసులు బయల్దేరారు. ఈ క్రమంలో తోటల చెరువుపల్లి నుంచి పామూరు వైపు వస్తున్న ఆటో.. బైక్ కోటవర్ధనపల్లి మలుపు వద్ద ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులును ఉదయగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తరలించారు.

పశువులతో వెళ్తున్న బొలెరో బోల్తా



దగదర్తి: పశువులతో వెళ్తున్న బొలెరో బోల్తాపడిన ఘటన మండలంలోని లయన్స్‌నగర్ సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. ప్రమాదంలో డ్రైవర్ స్వల్పంగా గాయపడగా, పశువులు పరారయ్యాయి. సమాచారం అందుకున్న దగదర్తి పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాఫిక్ స్తంభించకుండా చర్యలు చేపట్టారు. వాహన టైర్ పంక్చర్ కావడంతో ప్రమాదం సంభవించిందని పోలీసులు తెలిపారు. క్షతగాత్రుడికి హైవే అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక చికిత్స చేశారు. వాహనాన్ని క్రేన్ సాయంతో పక్కకు తొలగించారు.